




# ఊరు పిలిచింది

**- విన్నకోట సుశీలాదేవి**

ఉగాది పోటీలో ఎంపికైన కథ

హైద్రాబాదులో విమానం దిగినప్పటి నుండీ ఎప్పుడెప్పుడెళ్లి తన ఊరు చూద్దామా అని ఆరాటపడసాగాడు శ్రీధర్. అమెరికాలో వున్నప్పటికంటే హైద్రాబాదులో కాలుపెట్టినప్పటి నుండే ఊరుని చూడాలనే ఆరాటం అతనిలో మొదలయింది.

"నేను రేపు కార్లో రామాపురం వెళ్లొస్తాను!" అన్నాడు భార్య సునీతతో.

"ఊ! మొదలెట్టారు! ఇంకా ఆమాట అనలేదేమిటా అని చూస్తున్నా! అయినా రేపెలా వెడతారు. మనం కేశవరావుగారింటికి వెళ్లాలి గదా. వస్తామని చెప్పాం. వాళ్లు మనకోసం ఎదురుచూస్తుంటారు" అంది సునీత భర్తతో.

"అబ్బ! వాళ్లింటికి వెళ్లినప్పట్నించీ అమెరికాలో ఉన్న వాళ్ల అబ్బాయి గురించి ప్రశ్నలతో చంపుతారు ఆ ముసలాళ్లిద్దరూ. నువ్వెళ్ళు. నీకా కబుర్లు చెప్పడం ఇష్టమేగా."

"మీరు లేకుండా నేనెలా వెడతాను. మీ ప్రయాణం వాయిదా వేసుకోండి!"

"వీల్లేదు. నేను వెళ్లి తీరాల్సిందే. రేపెళ్లి ఎల్లుండొచ్చేస్తా నేను మాత్రం అక్కడ ఉండగలనా! ఏదో ఊరు చూడాలనే ఆరాటం... అంతే."

"నేనొక్కదాన్నీ వాళ్లింటికి వెళ్లను!"

"అయితే నేనొచ్చేదాకా ఆగు. రెండ్రోజుల్లో వచ్చేస్తాగా!" పోనీ నువ్వు కూడా రారాదూ! సరదాగా వెళ్లొద్దాం! "మా ఊరు చూసినట్లు వుంటుంది" అన్నాడు శ్రీధర్.

"ఛ! ఛ! ఆ పల్లెటూరికి నేను రాను. అంతా మట్టి-మురికి! ఏముందక్కడ చూడటానికి" అంది ముఖం చిట్లిస్తూ.

"ఆ మురికినీ- మట్టినీ చూడాలి! అదొక సరదా!" అన్నాడు. "ఆ సరదాలేవో మీరే పొందండి!" మాకక్కర్లేదు అంది సునీత.

"సరేలే! నేను వెడతాను కానీ... ఇక నేను పడుకొంటాను. మళ్లీ తెల్లవారుఝామునే లేచి ప్రయాణమవ్వాలిగా. ముందు కారు కోసం ట్రావెల్స్‌కి ఫోను చేయాలి"అంటూ తన రూములోకెళ్లాడు శ్రీధర్.

లోకల్ ట్రావెల్స్‌కు ఫోను చేసుకుని... తన ఊరుకు ప్రయాణం సిద్ధం చేసుకున్నాడు. మూడుగంటలకు అలారం పెట్టుకుని పడుకున్నాడు.

❖ ❖ ❖

ప్రత్యూష వేళ- చల్లటిగాలి హాయిగా శరీరాన్ని స్పృశిస్తోంది. ఉదయంపూట ప్రయాణం చేస్తుంటే ఫ్లాస్కు నిండా కాఫీ పోయించుకుని ప్రయాణం సాగించడం శ్రీధర్‌కి అలవాటు. చల్లని వాతావరణంలో వేడి కాఫీ తాగుతూ ప్రయాణం చేయడం అతనికిష్టం. ఇప్పుడు కూడా ఫ్లాస్కులోని కాఫీని కప్పులోకి వంచుకుని కొద్దికొద్దిగా తాగుతున్నాడు. కాఫీ పొగల మధ్య తన ఊరుని తలుచుకుంటుంటే... తన చిన్నప్పటి ఊరు- ఆ రోజులు అతని కళ్లముందు కదలాడ సాగాయి.

తన తండ్రి ఆ ఊరికి కరణం. ఆ ఊళ్లో తమకొక తాతలనాటి పెంకుటిల్లు. కొద్ది ఆస్తి వున్నాయి. తన తండ్రి ఆ ఇంటి అరుగు మీద చాప పరుచుకుని చిన్న డెస్కుముందు పెట్టుకుని ఊళ్లోవాళ్ల సమస్యలు పరిష్కరిస్తుండేవాడు. ఊళ్లోని పొలాలకు- స్థలాలకు సంబంధించిన సరిహద్దు తగాదాలన్నీ తన తండ్రి తీరుస్తుండేవాడు. ఎందుకంటే ఊరికి సంబంధించిన సమస్త వివరాలు ఆయన దగ్గర వుండేవి. తనకప్పుడు ఏడేళ్లుంటాయేమో. ఆ కాలం పద్ధతి ప్రకారం అయిదో ఏడున అక్షరాభ్యాసం చేసి ఒకటో క్లాసులో వేశారు. కాని తను స్కూలుకెళ్లింది తక్కువ. పాఠాలు చదవడం అస్సలు లేనే లేదు. కాని కరణంగారి కొడుకని తనని పాసు చేస్తుండేవారు. రోజల్లా ఊరి బయట ఉన్న చెరువులో ఈతలు కొట్టడం- జామ తోటలో తిరుగుతూ కాయలు కోయడం- మామిడి తోటలో స్నేహితులతో కోతి కొమ్మచ్చులాడటం- గుడి ప్రక్క స్థలంలో గోడుంబిళ్ల- బొంగరాల ఆట ఇవే అప్పటి తన దినచర్య. స్కూలు చదువుకంటే ఇవెంతో తనకిష్టంగా ఉండేవి. రెండేళ్లు ఇలా హాయిగా గడిచిపోయింది.

ఆ తర్వాత తండ్రి తను చెడిపోతున్నాడని రాజమండ్రిలో వున్న మావయ్య ఇంట్లో చదువుకు పెట్టాడు. ఇక అప్పటినుండీ సెలవుల్లో మాత్రమే ఊరిని చూడటానికి వెళ్లేవాడు. క్రమంగా చదువుమీద దృష్టిని మరల్చాడు. ఆ తర్వాత తండ్రి మరణం- పల్లెటూళ్లోని పెంకుటిల్లు అమ్మేయడంతో ఆ ఊరితో వున్న బంధం తెగిపోయింది. కాని అనుబంధం మాత్రం కొనసాగింది. వీల్లైనప్పుడల్లా ఆ ఊరికి వెళ్లి తను చిన్నప్పుడు తిరిగిన ఆ తోటల్లో- దొడ్లల్లో- తిరుగుతూ- చెరువు గట్ల వెంటా- పొలాల వెంటా నడుస్తూ ఆ రోజుల్ని తలుచుకుని ఆనందపడటం ఒక అలవాటుగా మారింది. ఆ అలవాటు అందమైన అనుభూతినిచ్చేది.

ఇంజనీరింగు అయ్యాక అమెరికా వెళ్లాడు. అక్కడే చదువు- ఉద్యోగం. అయినా ఇండియా వచ్చినప్పుడల్లా తను పుట్టిపెరిగిన ఊరుకి వెళ్లి చూడటం మాత్రం మానలేదు.

ఈ మధ్యకాలంలో ఇండియా వచ్చి నాలుగేళ్లయింది. ఆర్నెల్లనుండీ ఎప్పుడెప్పుడు ఇండియా వచ్చి తన ఊరు వెడదామా అని ఆశపడుతున్నాడు. ఇన్నాళ్లకు కుదిరింది. కారు రివ్వున సాగిపోతోంది. శ్రీధర్ వెనక్కి వాలి కళ్లు మూసుకున్నాడు. తన ఊరు ఎలా వుందో? చిన్నప్పుడు ఆడుకున్న ఆ ప్రదేశాల్లో తిరుగుతూంటే మళ్లీ తను చిన్నపిల్లాడై పోయినట్లు అన్పిస్తుంది. ఒక్కసారి ఆ చెరువులో ఈత కొడితే- జామ తోటలో రహస్యంగా జామకాయలు కోస్తే- దేవుడు స్థలంలో- ఆ ఇసుకలో గోలీలాట ఆడితే ఎంత బాగుంటుంది?

ఇప్పుడు తన పిల్లలు కొంచెం పెద్దవాళ్లయ్యారు. తను ఎప్పుడైనా తన చిన్ననాటి విశేషాలు కథలుగా చెప్తూంటే ఆసక్తిగా వింటున్నారు. 'మాకు కూడా అవి చూపించవా డాడీ' అని అడుగుతున్నారు.

'తనతోపాటు సునీత కూడా వస్తే బాగుండేది. పిల్లలు అవన్నీ చూసినట్లుగా వుండేది!' అనుకున్నాడు శ్రీధర్.

కాని సునీతకు పల్లెటూళ్లంటే బొత్తిగా గిట్టదు. డర్టీ విలేజ్- డర్టీ పీపుల్ అని తిడుతుంది. ఈసారి పిల్లలకు తన ఊరి ప్రదేశాలు ఫొటోలు తీసి అవన్నా చూపించాలి. సంతోషిస్తారు అనుకున్నాడు. 'అన్నట్లు కెమెరా తెచ్చానా! లేదా?' అని చూసుకున్నాడు.. ప్రక్కనే వుంది విదేశీ కెమెరా. దీంతో తను చిన్నప్పుడు తిరిగిన ఆ ప్రదేశాలనీ ఫొటోలు తీసి పిల్లలకు చూపెడితే- ఈసారి వాళ్లమ్మని బలవంతంగా ఒప్పించైనా తనతో ఊరు వస్తారు అనుకున్నాడు.

నున్నని సిమెంటు రోడ్డుమీద కారు కుదుపుల్లేకుండా పరుగెడుతోంటే... మెత్తని కుషన్లు ఊయల్లా ఊగుతుంటే... కళ్లు మూతలు పడి... నిద్ర ముంచుకు వచ్చింది శ్రీధర్‌కి.

* * *

"సార్! మనం ఊరు వచ్చేశాం. ఎటెళ్లాలి?" డ్రైవరు మాటల్తో కళ్లు విప్పాడు.

"అప్పుడే వచ్చేసిందా? ఊరు" అన్పించింది.

టైము చూశాడు. పదకొండు దాటింది.

బయటికి చూశాడు.

ఎదురుగా 'రామాపురం' బోర్డు కనబడింది.

"డ్రైవర్ కారు ఇక్కడే ఆపు. ఊళ్లోకి కారు వెళ్లదు. అంతా మట్టి రోడ్డు. గతుకులుగా వుంటుంది. నడవడమే కష్టం. కారును ఆ చెట్టు క్రింద పార్కుచెయ్యి. ఊళ్లో తినడానికేమీ దొరకదు కూడా మళ్లా. ఒక గంటలో బయలుదేరుదాంలే"అన్నాడు శ్రీధర్ తన సామాన్లు తీసుకుంటూ.

"సార్! ఊళ్లోకి సిమెంటు రోడ్డు వుంది సార్! కారు హాయిగా వెడుతుంది" అన్నాడు డ్రైవర్.

"సిమెంటు రోడ్డా!" ఆశ్చర్యంగా అంటూ కారు దిగాడు. "నిజమే! ఊళ్లోకి సిమెంటు రోడ్డు వుందే!" అనుకుంటూ చుట్టూ చూశాడు.

ఆ ప్రాంతమంతా బాగా మారినట్లు కన్పించింది.

రోడ్డు ప్రక్కగా ఒక పెద్ద బస్సు షెల్టరు. దానిలో బెంచీలు కనబడ్డాయి. ఆ ప్రక్కనే ఒక బడ్డీకొట్టు... ఆ కొట్టు ముందు అద్దె సైకిళ్లు వున్నాయి.

"కారు ఎక్కండి సార్. ఊళ్లోకెడదాం"అన్నాడు డ్రైవర్.

శ్రీధర్ మళ్లీ కారెక్కాడు.

డ్రైవరు కారు స్టార్ట్ చేసి ఊళ్లోకి తీసుకెళ్లాడు.

కారులోనుండి చూస్తున్న శ్రీధర్‌కి ఊరంతా క్రొత్తగా కనబడింది.

ఎత్తుగా మేడలు- సినిమా హాలు- హోటళ్లు... ఇది తన ఊరేనా. లేక ఏదైనా పట్టణానికొచ్చామా? అన్పించింది.

"ఎక్కడ ఆపమంటారు?" అనడిగాడు డ్రైవరు.

"కారుని గుడి దగ్గర ఆపు!"

"అలాగేనంటూ రెండు వీధులు తిప్పి గుడిముందు ఆపాడు. శ్రీధర్ దిగాడు. కారునానుకుని చుట్టూ చూశాడు. ఊరంతా సిమెంటు రోడ్లు. ఎక్కడా చెత్త, చెదారం కనబడలేదు. తెల్లగా మెరిసిపోతోంది. ధ్వజ స్తంభం మీద చిరుగంటలు గాలికి ఊగుతూ మధురంగా ధ్వనిస్తున్నాయి.

భుజాన కెమెరా తగిలించుకుని ముందుకు నడిచాడు. గుడి ప్రక్కన పెద్ద స్థలం ఉండేది. అక్కడే చిన్నప్పుడు తను గోలీలాట- గోడుంబిళ్ల- బొంగరాల ఆటలు ఆడేవాడు. ఇప్పుడా స్థలంలో పెద్ద బిల్డింగు కనబడింది. దాని ముందున్న బోర్డుమీద 'పంచాయితీ ప్రాథమిక ఉన్నత పాఠశాల' అని వ్రాసి ఉంది. ఆ బిల్డింగుని చూసి శ్రీధర్ బాధపడ్డాడు. చక్కగా ఊరి పిల్లలందరూ ఆడుకునే స్థలంలో ఈ బిల్డింగు కట్టడమేమిటి? ఇంకెక్కడైనా కట్టొచ్చుగదా? పిల్లలెక్కడాడుకుంటారు అనుకున్నాడు.

ముందుకు నడిచాడు.

ఊరంతా చాలా మారిపోయింది. తాటాకు పాకల స్థానంలో డాబాలు; మేడలు కనబడుతున్నాయి. ఇళ్ల ముందు రంగవల్లులు లేవు. ఇళ్లల్లో నుండి టి.వి.ల ధ్వనులు మాత్రం వీధుల్లోకి వినబడుతున్నాయి. నిమిషానికొక మోటారు సైకిలు రోడ్డుమీద పరుగెడుతోంది.

అమెరికానుండొచ్చి! హైద్రాబాద్‌లో దిగగానే మన ఊరు చూడాలని పరుగెట్టుకు వచ్చానోయ్. కాని ఊరంతా చాలా మారిపోయింది నారాయణా. తోటలు- దొడ్లూ ఏమీలేవు. చెరువూ లేదు. ఈ ఊళ్లో మనుషులు కూడా చాలా మారిపోయారు. ఊరంతా సిమెంటు రోడ్లు... కార్లు... మోటారు సైకిళ్లు. ఊరు ఒకప్పటి ఊరులా లేదు.

ఏమిటీ మార్పు! దీనిక్కారణం ఏమిటి? అనుకున్నాడు.

జామ తోటలో నారాయణ వుంటాడు. అతడినడిగితే దీనిక్కారణం చెప్తాడు అనుకుంటూ మరో వీధి మలుపు తిరిగాడు. ఎదురుగా ఎప్పుడూ కనబడే జామ తోట లేదు. దాని స్థానంలో మరొక బిల్డింగు కనబడింది. దానిముందు మహిళా సంక్షేమ కేంద్రం అని వ్రాసిన బోర్డు వుంది. అది చూసి శ్రీధర్ నివ్వెరపోయాడు.

అరె.. జామ తోటని కొట్టేసి బిల్డింగుని కట్టారా... అనుకున్నాడు. ఎందుకో శ్రీధర్‌కి చెప్పరాని దుఃఖం కలిగింది. ఈ తోటలోని పళ్లు ఎంత తియ్యగా ఉంటాయి. ఆ చెట్లమీద చిన్నప్పుడు కోతి కొమ్మచ్చులాట ఆడేవారు. ఆ జ్ఞాపకాలు ఏవీ! ఆ ఆనంద క్షణాలు ఏవీ! "అన్నీ నాశనం చేసేశారే! ఊళ్లో ఉన్న ఖాళీ స్థలాలు- తోటలు అన్నీ ధ్వంసం చేశారు. చెరువునైనా మిగిల్చారో లేదో అనుకుంటూ ఊరి బయటికొచ్చాడు శ్రీధర్. అక్కడ చెరువు లేదు. పూడ్చేశారు. దాని స్థానంలో ఒక పెద్ద రిజర్వాయరులాటిది కనబడింది.

శ్రీధర్‌కి ఆవేదన- బాధ కలిగాయి.

తోటలు- చెరువులు లేవు. తన చిన్నప్పటి తీపి గుర్తులు లేవు. ఆనాటి మధురమైన జ్ఞాపకాలు లేవు. ఇక తనీ ఊరు రావడమెందుకు? తను మధురానుభూతులు పంచుకున్న ప్రదేశాలను తనివితీరా చూసి ఆనందించాలనుకున్నాడు. ఆ మధుర స్మృతులను ఫొటోలు తీసి తన పిల్లలకు చూపాలనుకున్నాడు. కాని ఆ జ్ఞాపకాలన్నీ తన తరంలోనే నాశనమైపోయాయి.

తన బాల్యానుభూతులు- ఆ మధురోహలు- తన ఉనికికి, అస్తిత్వానికి చిహ్నాలు.. అవి లేని ఈ ఊరుతో తనకిక పనిలేదు. తనీ ఊరు రాలేడు- రాడు కూడా...

"హల్లో శ్రీధర్... నువ్వేనా!"

పిచ్చి పట్టినవాడిలా నడుస్తున్న శ్రీధర్ ఆ పిలుపు విని హఠాత్తుగా ఆగాడు.

"శ్రీధర్ నేనురా! రాఘవరావుని!" అన్నాడతను శ్రీధర్‌కి ఎదురుగా నిలిచి.

శ్రీధర్ తన ఆలోచన్లనుండి బయటపడి అతడిని చూశాడు. తన చిన్నప్పటి స్నేహితుడు రాఘవరావు. ఎన్నాళ్లకి చూశాడు.

"రాఘవా! నువ్వు ఈ ఊళ్లోనా? ఏం చేస్తున్నావిక్కడ?" అనడిగాడు శ్రీధర్.

"నేను అగ్రికల్చర్ ఎం.ఎస్సీ. చదివాను. ప్రస్తుతం ఈ ఊళ్లోనే కొత్తగా ప్రభుత్వంవారు పెట్టిన వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో పనిచేస్తున్నాను. నువ్వు అమెరికా వెళ్లావుటగదా."

"అవునోయ్! అక్కడే ఉద్యోగం."

ఇద్దరూ నడుచుకుంటూ కుశల ప్రశ్నలు వేసుకుంటున్నారు.

"అదిగో... అదే మా ఆఫీసు వెడదాం. రా... శ్రీధర్" అన్నాడు రాఘవరావు.

ఇద్దరూ లోపలికెళ్లారు. అక్కడ నారాయణ కన్పించాడు.

"నారాయణా బాగున్నావా?" అంటూ పలకరించాడు శ్రీధర్.

"ఆ! బాగున్నా బాబూ!" రండి. కూర్చోండి!" అన్నాడు.

నారాయణ కూడా మారినట్లు కన్పించాడు.

"ఎప్పుడొచ్చారు బాబూ!"

"రెండ్రోజులైంది! అమెరికానుండొచ్చి! హైద్రాబాద్‌లో దిగగానే మన ఊరు చూడాలని పరుగెట్టుకు వచ్చానోయ్. కాని ఊరంతా చాలా మారిపోయింది నారాయణా. తోటలు- దొడ్లూ ఏమీలేవు. చెరువూ లేదు. ఈ ఊళ్లో మనుషులు కూడా చాలా మారిపోయారు. ఊరంతా సిమెంటు రోడ్లు... కార్లు... మోటారు సైకిళ్లు. ఊరు ఒకప్పటి ఊరులా లేదు. ఎంతో ఆరాటంగా వచ్చాను. కాని తీరా ఊరు చూశాక అనవసరంగా వచ్చాననిపించిందోయ్" అన్నాడు శ్రీధర్ బాధగా.

నారాయణ, రాఘవరావు అతని వేపు ఆశ్చర్యంగా చూశారు.

"ఊరు మారకూడదంటారా?" నారాయణ అడిగాడు. "మరీ పట్టణమైతే ఎలాగయ్యా. ఆ తోటలూ- దొడ్లూ- చెరువులూ అలాగే వుంటే అవన్నీ చూస్తోంటే మాకెంత ఆనందంగా వుంటుందో. ఆ చిన్నప్పటి రోజులు గుర్తొస్తాయి. ఇక ఇప్పుడు ఆ జ్ఞాపకాలు ఏవీ. అందుకే ఇక ఈ ఊరు రావాలనుకోవట్లేదు నారాయణా" అన్నాడు శ్రీధర్. (మిగతా 12వ పేజీలో)

# మేధావుల ఆత్మవిశ్వాసం

అద్భుతాలు సాధించిన అసాధారణ వ్యక్తుల్లో చాలా మంది అర్థబలం, అంగబలం లేకపోయినా ఆత్మవిశ్వాసంతో ఎదిగినవారే.

షేక్స్‌పియర్ ఐదవ తరగతి రెండుసార్లు తప్పాడు. అయినా మహా కవి అయ్యాడు.

జార్జి బెర్నార్డ్‌షాకి స్పెల్లింగులు సరిగా వచ్చేవికావు. అయినా గొప్ప రచయిత అయ్యాడు.

బెంజిమిన్ ఫ్రాంక్లిన్ లెక్కల్లో ఎప్పుడూ ఫెయిలయ్యేవాడు. అయినా గొప్ప సైంటిస్టు అయ్యాడు.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కి పదేళ్ళవరకూ మాటలే సరిగా రాలేదు. అయినా మహా గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగి ఎన్నో గొప్ప, గొప్ప ఉపన్యాసాలు చేశాడు.

చర్చిల్‌ని సైన్యంలోకి పనికిరావని వెనక్కి పంపారు. ఆర్మీకి జనరల్ అయ్యాడు, దేశాధ్యక్షుడయ్యాడు.

సిగ్మండ్ ఫ్రాయిడ్‌కి ప్రయాణాలంటే భయముండేది. గొప్ప సైకాలజిస్టు అయ్యాడు.

బిల్‌గేట్స్ స్కూల్ డ్రాపవుట్- అయినా కంప్యూటర్ రంగంలో ప్రపంచ ప్రఖ్యాతి చెందాడు.

అబ్రహాం లింకన్ పొందినన్ని అవహేళనలు, అవమానాలు, అపజయాలు ఎవరూ పొందలేదు. అయినా అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించి ప్రపంచ దేశాల్లోనే అమెరికాను అగ్ర రాజ్యంగా నిలబెట్టాడు.

మహాత్మాగాంధీ- స్వాతంత్ర్యాన్ని సంపాదించడానికి ఒక్క రాకెట్ ప్రయోగించకుండా, సైనికులను యుద్ధంలోకి దించకుండా చేసిన అహింసా యుద్ధం ప్రపంచాన్నే నివ్వెరపరిచింది.

**- పి.వి.రమణకుమార్**

# సెక్స్ ట్రెయిన్




ఇటీవల ఆస్ట్రేలియాలోని పెర్త్ నగరంలో సెక్స్‌పో నిర్వాహకులు ఓ సెక్స్ ట్రెయిన్‌ను రెడీ చేసారు. ఈ ట్రెయిన్ లోపలి భాగంలో మనిషిని శృంగారం వైపు ఆకర్షితుల్ని చేసే సెక్స్ చిత్రాలు ఉంటాయి. ఈ ట్రెయిన్‌లో ప్రయాణంచేసే సమయంలో ప్రయాణీకుల మంచిచెడులు చూసుకోవడానికి అర్ధనగ్నంగా ఉండే సుందరీమణులను ఏర్పాటుచేసారు. ఇవే కాక కంప్యూటర్ స్క్రీన్స్ ఏర్పాటుకూడా ఉంది. వీటిలో వెర్రెత్తించే శృంగార సన్నివేశాలు ప్రసారమవుతాయి. పెర్త్‌నుంచి బయలుదేరే ఈ ట్రెయిన్‌లో ప్రయాణించేందుకు దేశ విదేశాలవారు దాదాపు 36వేల మంది అడ్వాన్స్‌లు చెల్లించేశారు. దీనికి కొసమెరుపు ఏమిటంటే ఈ ట్రెయిన్‌లో శృంగార సముద్రంలో ముంచేసే సన్నివేశాలే తప్ప రియల్ సెక్స్‌కి మాత్రం అనుమతి లేదు. 36 సంవత్సరాల వయసున్న వారికి మాత్రమే ఈ ట్రెయిన్‌లో ప్రవేశముంటుంది.

దీని సంగతి ఇలా ఉంటే స్విస్‌కు చెందిన ఓ సైంటిస్ట్ మాన్‌ఫ్రెడ్ ఓ కొత్త సంగతి తెలియజేసాడు. శృంగారంలో క్లైమాక్స్‌కు చేరినప్పుడు మన శరీరం నుండి ఉత్పత్తిఅయ్యే ఫాగోసైట్ సెక్స్ జలుబును దూరం చేయగల సత్తా ఉందని తేల్చి చెప్పాడు.

కాఫీ సైతం శృంగారానికి ప్రోత్సాహమిస్తుందని పరిశోధనల్లో రుజువైంది. మామూలుగాకన్నా సుమారు 10 శాతం ఎక్కువ సెక్స్ సామర్థ్యాన్ని కలిగిస్తుందట ఈ కాఫీ.

ఇవన్నీ విన్నాక బెర్లిన్‌లోని ఓ వేశ్యకు ఫ్లాష్‌లా ఓ ఐడియా వచ్చింది. ఇక్కడ వేశ్యా వృత్తి చట్టబద్ధమే కాబట్టి బ్రహ్మచారులకు ఓ ట్రెయినింగ్ సెంటర్ ఓపెన్ చేసింది. ఇక్కడ థియరీ 80, ప్రాక్టికల్స్ 20 శాతం ఉంటాయి. ఎయిడ్స్‌లాంటి వ్యాధుల గురించి కూడా మంచి అవగాహన కల్పించడం సెక్స్‌లోని అనవసరమైన భయాలు పోగొట్టడం లాంటివి చేస్తోంది. ఇవన్నీ చదివి ఔరా అనుకొంటున్నారా?

**- కలపర్తి సత్యం**

(9వ పేజీ తరువాయి)

క్షణం ఆగి "బాబూ! ఒక్క విషయం అడగనా?" అన్నాడు నారాయణ.

"ఏమిటది?"

"మీరు చిన్నప్పటిలా వున్నారా? లేరు కదా. బాగా పెరిగారు. పెద్దోరయ్యారు. బాగా చదూకున్నారు. అమెరికాకూడా వెళ్లారు. కార్లూ- మేడలూ అన్నీ వొచ్చాయి మీకు. మరి ఇక్కడ పుట్టిన మీరే మారిపోయారు గదా. మీరు పుట్టిన ఊరు మారొద్దా" అన్నాడు నారాయణ.

ఆ మాటలకు శ్రీధర్ బిత్తరపోయాడు.

"అయ్యా! మీరు బాగా ఎదిగారు. ఉన్న ఊళ్లోని పొలాలూ- ఇళ్లు అమ్ముకుని అమెరికా వెళ్లారు. లక్షలు సంపాయిస్తున్నారు. అప్పుడప్పుడు మీరు పుట్టిన ఊరు చూడాలని వస్తారు. మీ సంతోషంకోసం- మీ ఆనందంకోసం మేం మట్టిలో- బురదలో బతుకుతుండాలి... అంతేగా..."

రాఘవరావు కల్పించుకున్నాడు.

"నారాయణా! ఏమిటంత ఆవేశం!"

"ఆవేశం కాదయ్యా! ఆవేదన. శ్రీధర్‌బాబు నాలుగేళ్ల క్రితం మనూరు వొచ్చినపుడు అయ్యా మీరు బాగా చదువుకున్నారు. మా పిల్లోళ్లు సదూల్లేక మట్టిగొట్టుకుంటున్నారు. గుడి ప్రక్క స్థలంలో బడి కట్టించండయ్యా అని అన్నా. దానికీయన 'అబ్బే అలా కుదరదు. ఆ స్థలం అలా ఉండాల్సిందే' అన్నారు. అయ్యా శ్రీధర్‌బాబూ! మీరీ ఊళ్లో పుట్టారు- పెరిగారు. మీరు బాగుపడ్డారు. కాని వూరికేం చేశారయ్యా" అనడిగాడు నారాయణ.

శ్రీధర్ మాట్లాడలేదు... తలొంచుకున్నాడు.

'ఈ వూరినింత బాగుచేసింది ఈ రాఘవరావుగారేనయ్యా. ఆయనకి చదువైపోగానే పెద్ద ఉద్యోగాలొచ్చాయి. అమెరికా వెళ్లే అవకాశం వచ్చినా వొదులుకున్నారు. పుట్టిపెరిగిన ఊరిని బాగుచేయాలని ఇక్కడే ఉండిపోయారు. బడి కట్టించారు. గుడి బాగుచేశారు. చెరువు పూడ్చి రిజర్వాయరు పెట్టి మంచినీళ్లిచ్చారు. జామతోట కొట్టించి మా ఆడోళ్లకు డబ్బొచ్చే పన్లు పెట్టారు. మామిడి తోటలో పాడి గేదెల పెంపకం మొదలెట్టారు. రోడ్లేయించారు. ఈ అయ్య రాకతో మా ఊరే మారిపోయింది. మా పిల్లోళ్లు చక్కగా చదువుకుంటున్నారు. మా ఆడోళ్లు కూడా అంతోఇంతో సంపాయిస్తున్నారు. మేం ఇప్పుడు హాయిగా బతుకుతున్నామయ్యా' అన్నాడు నారాయణ సంతోషంగా.

శ్రీధర్‌కి ఆ మాటలు కనువిప్పు కలిగించాయి. పశ్చాత్తాపం కలిగింది. అవును! తను చాలా తప్పు చేశాడు. తన చిన్నప్పటి జ్ఞాపకాలు అలాగే ఉండాలనుకున్నాడు కానీ ఊరు గురించి పట్టించుకోలేదు. నారాయణ అన్నట్లు తను ఎంతో ఎదిగాడు. ఊరు ఎదగవద్దా...

"శ్రీధర్ నారాయణ మాటలు పట్టించుకోవద్దు"అన్నాడు రాఘవరావు శ్రీధర్ భుజం మీద చెయ్యి వేసి.

"లేదు రాఘవా! నారాయణ చెప్పింది అక్షర సత్యం. నువ్వు ఊరికి చాలా మేలు చేశావు. ఊరు మనకేమిచ్చిందని కాదు. పుట్టిన ఊరికి మనమేం చేశామని ప్రశ్నించుకోవాలి. నిజంగా నీ త్యాగం... శ్రమ నాలాటి వాళ్లకి ఆదర్శం. నేను కూడా నావంతు కృషి చేస్తా. నన్ను కూడా నీ కార్యక్రమాల్లో పాలుపంచుకోనివ్వు...;"అన్నాడు శ్రీధర్ రాఘవరావు చేతులు పట్టుకుని.

"అలాగే శ్రీధర్" ఆప్యాయంగా కౌగలించుకున్నాడు రాఘవరావు శ్రీధర్ని.

వాళ్లిద్దర్నీ చూస్తూ 'నా ఊరు ఇంకెంత గొప్పదైపోతుందో!' అనుకున్నాడు నారాయణ!

★